

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.35 (గురువారం సాయంత్రం) సహర్ : 4.51 (శుక్రవారం ఉదయం)
దివ్య ఖురాన్ పఠించినప్పుడు వారి విశ్వాసం మరింత అధికం అవుతుంది. వారు తమ ప్రభువు మీదే దృఢ నమ్మకం కలిగి ఉంటారు.

ఉగాది కానుకగా.. సన్న బియ్యం!



రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్న డీలర్ (ఫైల్)

చౌకధరల దుకాణంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం (ఫైల్)

- జిల్లాలో 6లక్షల 32వేల 819 మందికి లబ్ధి
- 1 నుంచి సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు
- అక్రమ బియ్యం రవాణాకు అడ్డుకట్ట పడేనా?
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఆదిలాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఉగాది పండుగ కానుకగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన మేరకు సన్న బియ్యాన్ని సమకూర్చుకోవాలని సూచించింది. ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే డీలర్ల వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని వెనక్కి తీసుకుని సన్న బియ్యాన్ని సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సన్న బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఇకపై ఆహార భద్రత కార్డుదారులకు కూడా సన్న బియ్యాన్ని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 355 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో లక్షా 92వేల 233 రేషన్‌కార్డులు ఉన్నాయి. మొత్తం 6లక్షల 32వేల 819 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 6 కిలోల చొప్పున మొత్తం 4035 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాకు కేటాయించనున్నారు. అయితే ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొత్తగా లబ్ధిదారులకు సరఫరా చేసే సన్న బియ్యం నాణ్యతపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర జిల్లాలపైనే ఆధారం

మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ యేడు ఖరీఫ్ సీజన్ నుంచి సన్న రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. మద్దతు ధరకు అదనంగా రైతులకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను చెల్లిస్తోంది. కానీ జిల్లాలో సన్న ధాన్యం సాగు నామ మాత్రంగానే కనిపిస్తోంది. దీంతో ఇతర జిల్లాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో సన్నధాన్యాన్ని సేకరించే అవకాశం లేక పోవడంతో ఇతర జిల్లాల నుంచి సన్న బియ్యాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉగాది పండుగను పురస్కరించుకుని ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యాన్ని సరఫరా చేసేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ జిల్లాకు అవసరమైన స్టాక్ రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

తింటారా లేక అమ్మేసుకుంటారా?

ప్రభుత్వం సరఫరా చేసే సన్న బియ్యాన్ని లబ్ధిదారులు తినేందుకు ఇష్టపడతారా లేదా దొడ్డు బియ్యం మాదిరిగానే అమ్మేసుకుంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కిలో దొడ్డు బియ్యం రూ.10 నుంచి రూ.15 వరకు దళారులకు విక్రయించారు. ఈ బియ్యాన్ని సరిహద్దులు దాటించి రూ.20 నుంచి రూ.30 వరకు వ్యాపారులు అమ్మేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో తరచూ రేషన్ బియ్యం పట్టుబడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. సన్న బియ్యాన్ని సరఫరా చేస్తే అక్రమ రేషన్ దందాకు అడ్డుకట్ట పడుతుందా లేదా అమ్మేసుకుంటారా అనే సందేహాలు లేక పోలేదు. ఎందుకంటే ఎంతో కొంత పంట భూమిని కలిగి ఉన్న రైతులు ఇప్పటికే ఖరీఫ్‌లో సన్న ధాన్యాన్ని పండించి తమ ఇంటి అవసరాలకు సరిపడా ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. అయినా కొంత మందికి ప్రభుత్వం రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యాన్ని సరఫరా చేస్తోంది. దీంతో అవసరానికి మించి బియ్యం నిల్వలు పేరుకపోతే రేషన్ బియ్యాన్ని అమ్మేసుకునే అవకాశాలే ఎక్కువగా ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నాణ్యతపై సందేహాలు

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్న బియ్యం ఉడికిన తర్వాత కొంత దొడ్డుగా మారే అవకాశం ఉంటుంది. దీంతో లబ్ధిదారులు తినేందుకు ఆసక్తి చూపకపోతే మళ్లీ దళారుల పాలయ్యే అవకాశం ఉంటుంది. సన్న బియ్యం పంపిణీకి ముందే గ్రామాల్లో లబ్ధిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం పోషక విలువలతో కూడుకుని ఉంటుందన్న విషయం రేషన్‌కార్డుదారులకు చెప్పాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తేనే సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టే అవకాశం ఉండదు. లేదంటే మళ్లీ దొడ్డు బియ్యం మాదిరిగానే సన్న బియ్యాన్ని కూడా అమ్మేసుకునే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సన్నబియ్యంపై వివిధ రకాల ప్రచారం జరుగుతోంది. ఈ బియ్యం ఉడికిన తర్వాత మెత్తగా, దొడ్డుగా మారి తినేందుకు వీలులేకుండా పోతుందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వమే సన్న ధాన్యాన్ని కొని మిల్లింగ్ చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో నాణ్యత విషయంలో ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

సన్న బియ్యం సరఫరాకు చర్యలు చేపడుతున్నాం

- వాజీద్‌అలీ, డీఎస్‌వో, ఆదిలాబాద్

ప్రభుత్వ ఆదేశాలతో రేషన్‌కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఏప్రిల్ 1 నుంచి జిల్లాలోని అన్ని చౌకధరల దుకాణాలకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తాం. ప్రతీ లబ్ధిదారునికి 6 కిలో చొప్పున సన్న బియ్యాన్ని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగానే సన్నబియ్యం సరఫరా ఉంటుంది. రేషన్ బియ్యాన్ని తీసుకుని అక్రమంగా అమ్మేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.



సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై మనోహర్, బాధితురాలు ఉమ

కోర్టు సమీపంలో నగల చోరీ

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లిన వైనం

ఉట్నూర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు సమీపంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమను నమ్మించి నగలు చోరీచేసిన ఘటన ఉట్నూర్ పట్టణంలో కలకలం రేపింది. బుధవారం ఉమ కోర్టులోకి వెళ్తుండగా కొందరు తాము పోలీసులమని నకిలీ ఐడీకార్డు చూయించారు. బంగారు నగలతో కోర్టులోకి వెళ్లవద్దంటూ ఆమెను బయటకు పిలిచారు. మెడలో ఉన్న పుస్తెలతాడు తీసుకుని ఆమె బ్యాగులోనే పెడుతున్నామంటూ నమ్మించి బైక్‌పై పరారయ్యారు. వెంటనే ఆమె దొంగలు పారిపోతున్నారంటూ ఉమ కన్నీరు మున్నీరు అయింది. ఉట్నూర్ ఎస్సై మనోహర్‌కు ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దొంగలు ఆదిలాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై పారిపోతున్నట్లు కొమురంభీం ప్రాంగణంలోని సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజీని పరిశీలించి తెలుసుకున్నారు. దొంగలు ముగ్గురు ఉండగా ఇద్దరు పారిపోతు మరోవ్యక్తికి బంగారం ఇచ్చారని ఎస్సై మనోహర్ అనుమానం వ్యక్తం చేశారు. ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇలాంటి ఘటన ఉట్నూర్‌లో మొదటిసారిగా జరిగిందని అన్నారు.

మాటల్లో పెట్టి గొలుసు చోరీ..

ఇచ్చోడ : మండలంలోని గాంధీనగర్ గ్రామం వద్ద ఆదిలాబాద్ వెళ్లడానికి బస్సుకోసం వేచి ఉన్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగలించిన ఘటన ఇచ్చోడ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇచ్చోడ ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన మల్కుల లక్ష్మి (59) ఆదిలాబాద్ వెళ్లేందుకు గాంధీనగర్ వద్ద బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మహిళ వద్దకు వచ్చారు. తన భార్య బంగారు గొలుసు ఇలాగే ఉండేదని, పోయిందని నమ్మబలికారు. ఒకసారి మీ గొలుసును చూపించండి అని అడుగగా ఆ మహిళ మెడలో ఉన్న 10గ్రాముల బంగారు అభరణాన్ని తీసి ఇవ్వడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో మహిళ బోరున విలపించింది. మహిళ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలి

- ఎంపీ గొడం నగేష్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి) : 50 శాతం కంటే ఎక్కువ శాతం గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ కోరారు. బుధ వారం జరిగిన పార్ల మెంట్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. దీంతో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల గిరిజనులకు లాభం జరుగుతుందన్నారు.

నీటి ఎద్దడిని తీర్చాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్లు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలో నీటిఎద్దడిని తీర్చాలని బుధవారం కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీకౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఆదిలాబాద్ పట్టణంలో నీటిఎద్దడి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున, దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్ తెలియజేశామన్నారు. అదే విధంగా సాంగి వద్ద రెండు చెక్‌డ్యాంలు, మావల వాటర్ వద్ద మట్టి పూడికతీత, పట్టణంలో మరో 10 వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేయాలని కోరారు. నిర్మల్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీరు కూడా నిరం తరంగా వచ్చేట్లు చేయాలని మాజీ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జహీర్ రంజని, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, ఇజ్జగిరి సంజయ్ పాల్గొన్నారు.

'ఆపదలో ఉంటే ఫిర్యాదు చేయండి'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు జరుగకుండా ప్రతిఒక్కరూ కృషిచేయాలని డీసీపీయూ సిబ్బంది ప్రేమ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీ మక్కామసీద్ షర్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో జిల్లా కో-ఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ కిరణ్ కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఒక వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారు ఎవరికి భయపడకుండా డయల్ 100, 181, 1098కి కాల్ చేయాలని సూచించారు.

జిల్లా ఆసుపత్రిని సందర్శించిన బృందం

ఉట్నూర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పరిశీలించడానికి బుధవారం సందర్శించిన కాయకల్ప బృందం సభ్యులు ఆసుపత్రి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ప్రతియేటా అందించే సౌకర్యాలను పరిశీలించేందుకు కాయకల్ప బృందం పర్యవేక్షించింది. అధికారిమూర్తి ఆధ్వర్యంలోని బృందం సభ్యులు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రసవాల పనితీరు ఎలా ఉంది, నెలలో ఎన్ని ప్రసవాలు అవుతున్నాయో పరిశీలించారు. అదే విధంగా ఆసుపత్రి పరిసరాలను ఆసుపత్రిలోని వార్డులను థియేటర్లను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్‌తో మాట్లాడుతూ ఆసుపత్రి పనితీరు బాగుందని కాయకల్పకు ఎంపిక అవుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, హెడ్‌నర్స్, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

గిర్నూర్ గ్రామంలో పోలీసుల కార్డన్ సెర్చ్



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామంలో బుధవారం బోథ్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం పూట కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అతిక్రమిస్తే కేసులు తప్పవన్నారు. ఆయన వెంట బోథ్ ఎస్సై ప్రవీణ్, బజార్హత్నూర్ ఎస్సై అప్పారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతుల సమక్షంలో ధరల నిర్ణయం



ధరలను నిర్ణయిస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హార్వెస్టర్ల వారు పంటలను శుద్ధి చేసి రైతులకు అందించడం జరుగుతోంది. అయితే కొంత మంది పంటల హార్వెస్టింగ్ చేసిన హార్వెస్టర్‌ల యజ మానులు ధరలను ఇష్టానుసారంగా నిర్ణయించడంతో బుధ వారం గ్రామ అభివృద్ధి కమిటీ వారిని రైతులు ఆశ్రయించారు. దీంతో వీడీసీ అధ్యక్షులు నల్లగొండ పోతన్న ఆధ్వ ర్యంలో ఆధ్వర్యంలో రైతుసంఘం మండల అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ సమక్షంలో హార్వెస్టర్ యజమానులు కలిసి సమావేశమై ధరలను నిర్ణయించారు. క్వింటాలు జొన్నలకు ఒక 130 రూపాయలు మక్కలకు వంద రూపాయలు పంటను కటింగ్ చేయడానికి ఎకరానికి 3,400 రూపాయలుగా నిర్ణయించారు. రైతులు రైతు సంఘం వీడీసీ ఆధ్వర్యంలో నిర్ణయించిన ధరల ప్రకారం హార్వెస్టర్ల యజమాను డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ జనరల్ సెక్రెటరీ సాయినాథ్ గౌడ్, కోశాధికారి రమాకాంత్, ఉపాధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

స్మశాన వాటికపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

నార్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కబ్జాకు గురైన స్మశాన వాటిక భూమిపై తహసీల్దార్ రాజలింగుకు బుధ వారం సంఘం నాయకులు అర్క గోవింద్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం క్రితమే తాము ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు సంఘం పరంగా ఈ అంశంపై ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకుంటలేరని అధికారులను ప్రశ్నించారు. చట్టపరమైన చర్యలు తీసు కుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు పుసం దేవ్‌రావు, కిన క భీమరావు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

పైలెట్ ప్రజావాణితో ప్రజల సమస్యల పరిష్కారం

- ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్

ఉట్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణ వేదిక ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఉట్నూర్ మండల ప్రత్యేక అధికారి ప్రజావాణి ప్రిసైడింగ్ ఆఫీసర్ సుధాకర్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రజావాణి బహిరంగ విచా రణ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏటీ డీవో క్రాంతికుమార్‌తో పాటు వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ, ఇందిరాక్రాంతి పథం తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు అధికశాతం పంట రుణమాఫీ కావడం లేదని గగ్గోలు పెట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కుటుంబంలో ఎవరైనా పంట రుణాలు పొంది ఉంటే రెండు లక్షలు దాటి ఉన్న రుణాలు మాఫీ కాలేదని, అలాంటి వారి కోసం ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు తయారుచేస్తుందని అన్నారు. వ్యవసాయ శాఖ కటాఫ్ డేట్‌లోపల పద్ధతులు లేవని అందుకే మాఫీ కాలేదని తెలపడంతో గిరిజన రైతులు అసంతృప్తికి లోనయ్యారు. అటవీ హక్కు భూములు తమ చేతుల్లో ఉన్న హక్కు పత్రాలు తమకు ఇవ్వడం లేదని గిరిజన రైతులు తెలిపారు. ఏటీడీఓ క్రాంతికుమార్ విరాసత్‌లు పూర్తి ఆధారాలతో కూడిన కాగితాలను కార్యాలయంలో సమర్పిస్తే బతికున్న వారిపై పాస్‌పుస్తకాలు వస్తాయని వివరించారు. ఇదే కాకుండా కొత్త రేషన్‌కార్డులు ఇంకా ఎప్పుడు ఇస్తారంటూ కొందరు కోరగా మరికొందరు తమ పేర్లు లేక పోవడం వల్ల తమకు రేషన్ అందడం లేదని రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల తమ పేర్లు గల్లంతు అయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్తకా ర్డులు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటుందని ప్రెసిడెంట్ ఆఫీసర్ సుధాకర్ ప్రజలకు వివరించారు.



ఉట్నూర్‌లో నిర్వహిస్తున్న పైలెట్ ప్రజావాణి వేదిక

ఇంద్రవెల్లిలో మార్కెట్, సంత వేలం

ఇంద్రవెల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రోజు మార్కెట్, వార సంత వేలంను బుధవారం ఈవో సంజీవ్‌రావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. రోజు వారి మార్కెట్‌కు రూ.మూడు లక్షల 25 వేలకు డోలే మంతోష్ దక్కించుకున్నాడు. ప్రతిసోమవారం నిర్వహించే వారసంతకు కేవలం రూ.9 లక్షల 60 వేలు మాత్రమే పాట పడటంతో వార సంత వేలంను వాయిదా వేసినట్లు ఈవో సంజీవ్‌రావు తెలిపారు. తిరిగి వారసంత వేలం పాటను గురువారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ డీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, గ్రామ పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

ఉట్నూర్ : ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతతో పాటు డైలీమార్కెట్‌కు నిర్వహించిన తైబజార్ వేలం ద్వారా పంచాయతీకి రూ.16.25లక్షల ఆదాయం వచ్చిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్ తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతను వేలం పాట ద్వారా ఇంద్రవెల్లి మండలం కేసుల గూడకు చెందిన కురిసింగ లక్ష్మణ్ రూ.11.20లక్షలకు, డైలీ మార్కెట్‌ను మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి రూ.5.04 లక్షలకు దక్కించుకున్నారన్నారు.

నవోదయ ఫలితాల్లో బోథ్ విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన సహన్ రెడ్డి

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సహన్‌రెడ్డి మంగళవారం ప్రకటించిన నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించాడు. ఓపెన్‌లో విద్యార్థి సీటు సంపాదించడం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కాగా బోథ్‌కు చెందిన నాగభూషణం పాఠశాలకు చెందిన ఇరు వురి విద్యార్థులు జాదవ్, తరుణ్ జాదవ్, శృతిలు మంచి ప్రతిభ కనబరిచి నవోదయ పాఠశాలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా నవోదయ పాఠశాలలకు ఎంపికైన విద్యా ర్థులను నాగభూషణం పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ విద్యార్థులను అభినందించారు. ఈ సం దర్భంగా ఆయన మాటాడుతూ చిన్నతనం నుంచి విద్యపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్ ఉన్నారు.

ఉపాధి హామీ పనులను సకాలంలో పూర్తిచేయాలి

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. మండలంలోని ధనూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలి రేట్లు చెల్లిస్తామని కూలీలకు వివరించారు. అంతేగాక ఉపాధి హామీ కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న చిన్న చిన్న కాలువలను నీటి కుంటలను ఎంత మేరకు తవ్వాలనేది వివరించారు. అనంతరం నాగపూర్, జై నూర్ పల్లి గ్రామాలలో తాగునీటి వసతులను పరిశీలించారు.

దొరికిన ఫోన్ అప్పగించిన ఆటోడ్రైవర్

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆటోడ్రైవర్ నౌసద్‌ఖాన్‌కు బుధవారం ఫోన్ దొరికింది. దీంతో దొరికిన సెల్‌ఫోన్ సదరు డ్రైవర్ సీఐ వెంకటేశ్వరరావుకు అప్పగించారు. దీంతో ఆయన ఫోన్ పోగొట్టుకున్న ఇచ్చోడ గ్రామానికి చెందిన రమణయ్యకు తిరిగి అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీగా దొరికిన సెల్‌ఫోన్ సీఐకి అప్పగించడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.

ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కలెక్టర్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున ఆదిలాబాద్‌లో ఇఫ్తార్ విందు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎండబ్ల్యూవో రాజలింగు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఉపవాసదీక్షలు విరమించి విందు ఆరగించారు.

స్వయం ఉపాధి శిక్షణ

ఉట్నూర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ యువతకు మూడు నెలల స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నామని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ మొహమ్మద్‌గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్, కుట్టుమిషన్, సెల్‌ఫోన్ రిపేరింగ్, హౌజ్‌వైరింగ్, ఫోటోగ్రఫి, టూ విలర్ మెకానిక్‌లతో మూడు నెలల శిక్షణ ఇస్తామని శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యంతో పాటు రవాణా చార్జీలు ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో టూల్ కిట్స్, రెండు జతల దుస్తులు ఇస్తామని, శిక్షణ అనంతరం కోర్సు సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 18 నుంచి 45ఏళ్ల లోపు వారు పదవ తరగతి వరకు చదువుకున్న వారు ఏప్రిల్ 5లోగా తెల్లరేషన్ కార్డు కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు బుధవారం తీర్పునిచ్చారు. 2022, ఆగస్టు 21న జైనథ్ మండలంలోని రాంపూర్‌కు చెందిన కొడిమెల ప్రభాకర్ పాత కక్షల కారణంగా ఉట్ల రమేష్‌ను కత్తితో పొడిచి చంపాడు. అప్పటి జైనథ్ ఎస్సై పెర్సిస్, సీఐ నరేశ్ కుమార్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు 18 మందిని కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ చేశారు. దీంతో నిందితుడికి పై మేరకు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడేలా ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ప్రత్యేకంగా అభినందించారు.



ఖానాపూర్‌లో వీర హనుమాన్ విజయయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిందూ సంఘాల నాయకులు

వీర హనుమాన్
విజయయాత్రను జయప్రదం చేయండి

ఖానాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 1వ తేదీన ఖానాపూర్‌లో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాశవేణి ప్రణయ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పద్మావతి నగర్ కాలనీలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ... హిందూ ఐక్యతే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హైందవ సోదరులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వాసుదేవాచార్యులు, హిందూ సంఘాల నాయకులు పడాల ప్రభాకర్, మహాజన్ జీతేందర్, తుమ్మనపల్లి సాంకేత్ వర్ధన్, రాపల్లి రవీందర్, దర్శనాల రాకేష్, ఆసం ఉదయ్, జోగు లోకేష్, టి. రాజశేఖర్, సాయి, ప్రతాప్, ప్రణీత్, తరుణ్, యోగేష్, బంటి, తదితరులున్నారు.

అడెల్లి ఆలయ హుండీ లెక్కింపు పూర్తి



హుండీని లెక్కిస్తున్న భక్తులు

సారంగాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహా ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ హుండీ లెక్కింపు బుధవారం నిర్వ హించారు. ఈ హుండీ లెక్కింపులో నగదు రూ. 36 లక్షల 46 వేల 375, బంగారు 210 గ్రాములు, వెండి 4 కిలోల 700ల గ్రాములు వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేష్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

పోటీ పరీక్షల్లో ఎస్ఆర్ విద్యార్థుల ముందంజ



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌తో పాటు గ్రూప్స్ మెయిన్స్ తదితర పరీక్షల్లో ముందున్నారని యాజమాన్యం తెలిపింది. బుధవారం కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ నగేష్, డీన్ దేవిదాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్ సేవలు

● నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల



భరోసా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్ తదితరులు

భైంసా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా భరోసా సెంటర్ సేవలు అందిస్తుందని జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల పేర్కొన్నారు. బుధవారం భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో కలిసి భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు అన్ని విధాలుగా సహాయ,సహకారాలు అందించబడుతాయని తెలిపారు. కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు వైద్య,న్యాయ,పోలీసు సేవలు అందిస్తామని వెల్లడించారు.లైంగిక దాడుల గురైన బాధితులకు భరోసా కేంద్రం ద్వారా సత్వర సేవలు అందిస్తామని వివరించారు.బాధితులు భరోసా కేంద్ర సేవలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

● ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

భైంసాలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డా. జానకీ షర్మిల బుధవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని సత్వర పరిష్కారం కోసం గాను సంబంధిత పోలీసు స్టేషన్ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిగతులు, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను సద్వినియోగపరుచుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరమయ్యేలా పోలీసు శాఖ సహకరిస్తుందని వివరించారు. ప్రజలకు మరింత చేరువై శాంతిభద్రతలను పరిష్కరిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ పాటుపడుతోందని వివరించారు. ఇందులో భైంసా టౌన్ , రూరల్ సీఐలు గోపీనాథ్, నైలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఇఫ్తార్ విందు

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎస్పీ జానకి షర్మిల పాల్గొని రంజాన్ పండగ సదర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష అత్యంత పవిత్రమైందన్నారు. ఇఫ్తార్ విందులో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్లు, ముస్లిం సోదరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ కార్మికుల ఆందోళన



బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బాసర, మార్చి, 26 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద బైటాయించి నిరసన తెలిపారు. దాదాపు 3 గంటల పాటు ధర్నా చేశారు. రెండు నెలల పెండింగ్ వేతనాలతో పాటు తమకు బెనిఫిట్స్ అందివ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. మూడు సంవత్సరాల నుంచి పెరిగిన జీత భత్యాలతో పాటు ఈఎస్ఐ ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. కనీసం పే స్లిప్స్ అడిగినా కూడా ఇవ్వడం లేదని అన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ కార్మికులతో మాట్లాడి ఈ నెల ఆఖరు వరకు సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి కార్మికులు విధుల్లో చేరారు.

వైద్య, ఆరోగ్యశాఖలో బయోమెట్రిక్ హాజరు

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో గురువారం నుండి సిబ్బందికి బయో మెట్రిక్ హాజరు విధానం అమలు చేయనున్నట్టు జిల్లా అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ విధానం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. గతంలోనే ఈ విధానం అమలు చేసినప్పటికీ బయో మెట్రిక్ సాంకేతిక ఇబ్బందులతో ఆటంకాలు ఏర్పడ్డాయని ప్రస్తుతం వాటినన్నిటిని మరమ్మతులు చేసి అమర్చామని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : డీఈవో

ముథోల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ బాలికల (తెలుగు, ఉర్దూ మీడియం) ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విద్య పట్ల అవగాహన కల్పించుటకు ప్రతి పాఠశాలలో కంప్యూటర్లను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ప్రారంభమైందని, కంప్యూటర్ ఆర్టిఫిషియాల్ ఇంటెలిజెన్స్ ఎడ్యుకేషన్ ప్రాథమికస్థాయిలో నిర్వహించే ఎఫ్ఎల్ఎన్‌కు దోహద పడుతుందన్నారు. ప్రాథమిక స్థాయిలో బి, సి గ్రేడ్ విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితంలలో పిల్లల స్థాయికి అనుగుణంగా ప్రాక్టీస్ చేయడం వల్ల విద్యార్థుల స్థాయి పెరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలో స్థాయిలో 50 మంది విద్యార్థులు కలిగి ఉంటే పాఠశాలకు కంప్యూటర్లు ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ లింబాద్రి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కవిత, ఉర్దూ మీడియం హెచ్ఎం నారాసింగ్‌రావు, తెలుగు మీడియం, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ
కార్యక్రమాలను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : 'జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్‌లు బుధవారం కోరారు. మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఓడ్నాల రాజేశ్వర్‌లతో పాటు మాజీ సర్పంచ్‌లు అబ్బడి ప్రతాప్‌రెడ్డి, బిట్లింగ్ నారాయణ, గంగాధర్ గౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ గురాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్‌లో
ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌కు స్థానం



మ్యాగజైన్ ముఖచిత్రంపై ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, మార్చి, 26 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్ తాజా ఎడిషన్ 140 లో చోటు లభించింది. ఈ మ్యాగజైన్‌లో భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై ప్రొఫెసర్ గోవర్ధన్ తన దృష్టి ఆలోచనలు పంచుకున్నందుకు ఈ గౌరవం దక్కింది. బిజినెస్ టాక్జ్ మ్యాగజైన్ అనేది విజయవంతమైన వ్యవస్థాపకులు, వ్యాపార నాయకుల సంస్థల కథలను ప్రదర్శించే ప్రముఖ ప్రచురణ సంస్థ, ప్రపంచ స్థాయి విద్యను అందించడంతో పాటు ఆవిష్కరణ, పరిశోధన సంస్కృతిని పెంపొందిం చడంలో ఆర్జీయూకేటీ నిబద్ధతను ఇది నిదర్శనం అని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ఈ సందర్భంగా అన్నారు. దేశంలో ప్రముఖ సంస్థగా ఆర్జీయూకేటీ గుర్తింపు పొందడం మాకు గర్వకారణం, విద్య పరిశోధనలో రాణించడానికి మేము నిరంతరం కృషి చేస్తా మని వీసీ పేర్కొన్నారు. ఈ విజయం పట్ల ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళిదర్శన్, ఏవో రణదీర్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ విట్టల్, విభాగాల అధిపతులు, సిబ్బంది వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్‌కు అభినందనలు తెలిపారు.

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందజేయాలి'

నిర్మల్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ విధంగా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇచ్చే విధంగా జిల్లా కలెక్టర్లకు, నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఆదేశాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిర్మల్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్యలు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. అలాగే గ్రామాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లల్లో ఒకటి రెండు గృహాలను జర్నలిస్టులకు కేటాయించాలన్నారు. జర్నలిస్టు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే విధంగా కృషి చేయాలని వారు ప్రభుత్వ పెద్దలను కోరారు.

యువత క్రమశిక్షణతో
శ్రమిస్తే లక్ష్యసాధన సులభం

ఖానాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నేడు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో యువత క్రమశిక్షణతో శ్రమిస్తే లక్ష్య సాధన సులభతరం అవుతుందని సత్యసాయి సేవా సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు భీమ్ సింగ్ అన్నారు. ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో సత్యసాయి సేవా బృందంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా యువత వ్యసనాలకు బానిస కాకుండా ఆధ్యాత్మిక మార్గం వైపు దృష్టి సారించాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానవుడిలో మానసిక దృఢత్వం పెంపొందుతుందని ఆయన సూచించారు. అనంతరం ఇటీవల పంచాయతీ రాజ్ ఏఈగా ఉద్యోగం సాధించిన ఖానాపూర్‌కు చెందిన జి. లక్ష్మీప్రసన్నను సత్యసాయి సేవా బృందం ఆధ్వర్యంలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా బృందం సభ్యుడు చిక్యాల రత్నాకర్ రావు, పాల గంగాధర్, ఘంటసాల గంగాధర్, జీఎల్‌వీ ప్రసాద్, తదితరులున్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీవో

నర్సాపూర్(జి), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధి హామీ పథకం కింద నాటిన 15 వేల మొక్కలను బుధవారం మధ్యాహ్నం ఎంపీవో తిరుపతిరెడ్డి పరిశీలించారు. నాటిన మొక్కల గురించి ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎండ కాలం మొక్కలు ఎండిపోకుండా వాటికి ప్రతిరోజు నీరు అందించాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు. వారితో పాటు గ్రామ కార్యదర్శి కైలాస్ రాథోడ్ ఉన్నారు.

బోరు బావికి మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడిహత్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు నీటి సమస్యను పరిష్కరించారు. మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు కాలనీలో మంచి నీటి సమస్య పరిష్కరిం చాలని ఈనెల 19న ఆంధ్ర జ్యోతి కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయితీ కార్యదర్శి రాందాస్ బోర్ బావికి బోర్‌లోని మోటార్ తీయించి మరమ్మతులు చేపట్టి బుధవారం మోటార్ ఏర్పాటు చేశారు. నీటి సమస్య తీరడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని బిక్కుతండా గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం బిక్కుతండా గ్రామానికి చెందిన సెడ్మాకి చంద్రకాంత్ (28) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. భార్య సెడ్మాకి మంజుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్నారు. చంద్రకాంత్ 10 రోజులుగా జ్వరంతో పాటు మతి స్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తుండటంతో కుటుంబ సభ్యులు మండలంలోని ముత్నూర్ గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా ఆరోగ్యం కుదుట పడింది. కాని తనకు ఏదో అయిందని బయపడుతుండేవాడని, రాత్రి ఇంట్లో నిద్రిపోయే వాడు కాదని తెలిపారు. గురువారం ఉదయం భార్య భార్య అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య మంజుల ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులున్నారు.

మృతదేహం లభ్యం

మావల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల పక్కనున్న మైదానంలో ఓ మృతదేహం లభ్యమైంది. గమనించిన స్థానికులు మావల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహం కేఆర్‌కే కాలనీకి చెందిన గంగానదిగా గుర్తించారు. రోజు వారి లేబర్‌గా పని చేసేవాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

మా భూమి రథయాత్ర కరపత్రాలు విడుదల

ఇచ్చోడ, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి) : లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో గడపగడపకు వెళ్లనుందని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు గణేష్ మహరాజ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నరేష్, రాజేశ్వర్, శేఖర్, రమేష్, లక్ష్మణ్, గంగన్న, భూమన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

ఉట్నూర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాను ఏఎన్ఎంలు కోరారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ పీఓ క్యాంప్ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిణి కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్న మొల్ల కిరణ్ మాట్లాడారు. కలెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి స్పందించాలని ఏఎన్ఎంలకు పూర్తి వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణం కోసం వచ్చిన రైతు

● సరైన పత్రాలు ఇవ్వలేదని రుణాన్ని నిరాకరించిన బ్యాంకు మేనేజర్
● ఇవ్వాలని పట్టుబట్టిన రైతు
● పోలీసులకు మేనేజరు ఫిర్యాదు



బ్యాంకులో రైతు, మేనేజర్‌తో మాట్లాడుతున్న పోలీసులు

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో కౌటబి గ్రామానికి చెందిన ఎన్.శ్రీనివాస్ రెడ్డి అనే రైతు పంట రుణం కోసం సహకార బ్యాంకుకు వెళ్లగా అతనిపై మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సదరు రైతు పత్రాలన్నింటినీ పరిశీలించామని, వారి కుటుంబసభ్యుల ద్వారా తమకు జీమెయిల్‌లో మెసేజ్ వచ్చిందని, భూమి పైన వివాదం ఉందని బ్యాంకు మేనేజర్ శైలజ పేర్కొన్నారు. అన్ని రకాల పత్రాలు మీ ముందు ఉంచుతున్నాను అని రైతు మేనేజర్ ముందు వాదించాడు. దీంతో మేనేజర్ పూర్తిస్థాయి పత్రాలు లేవని మరికొన్ని రోజులు ఆగాలని రైతుకు సూచించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకొని 25 రోజులు గడిచిపోయాయని, కాలయాపన చేస్తున్నారని రైతు మేనేజర్‌తో వాదించాడు. నిబంధనల ప్రకారం తనకు రుణం ఇవ్వాల్సిందేనని రైతు పట్టుబట్టడంతో మేనేజర్ ఇక్కడి నుంచి మీరు వెళ్ళండి అంటూ రైతు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులకు ఫోన్లో సమాచారం ఇవ్వగా పోలీసులు బ్యాంకుకు చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. రైతు మేనేజర్ మధ్య జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు పోలీసులు వివరించారు. అనంతరం పోలీసులు వెళ్లిపోయారు.

సరైన పత్రాలు ఇస్తే రుణం ఇస్తాం..

రైతు రుణం కోసం పూర్తిస్థాయిలో సరైన పత్రాలు ఇవ్వలేదని ఆ పత్రాలను తీసుకువచ్చినట్లైతే రుణం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మేనేజర్ పేర్కొన్నారు. అయితే రైతు మాత్రం ఇంతకాలం బ్యాంకుల చుట్టూ తిప్పుకొని ఇప్పుడేమో మాట మార్చారు అంటూ ఆరోపించారు. కాగా రైతు సహోదరుడు పెట్టిన మెయిల్ విషయమై ఉన్నతాధికారులకు వివరించి రుణం మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావు దేశ్‌పాండే మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంగదు కేంద్రీ రూపేందర్ సింగ్, ఆడేపు హరీష్, కుమ్మరి విజయ్, దమ్మపాల్, జమీర్, ఎట్టం రాములు, వివేక్ సింగ్, గంగాసాగర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన
బీఆర్ఎస్, బీజేవైఎం నాయకులు

నేరడిగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం సోనాల బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుకూరి నరేందర్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, అమృతరావు పాటిల్, చట్లపల్లి అనిల్, పాల శంకర్, నాయుడు, రవి, సద్దాం, విద్యాసాగర్‌రెడ్డి, శివాజీ తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ అనిల్‌కు మార్ యాదవ్‌ని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రూపేష్‌రెడ్డి, బోథ్ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డిలు బుధవారం ఢిల్లీలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఆయనతో విన్నవించారు. గత ఎన్నో ఏళ్లుగా మూతబడి స్థానిక ప్రజలకు ఉపాధి ఇవ్వలేక పోతున్న సీసీఐని పునఃప్రారంభిస్తే వేల మంది కార్మికులకు ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. దీనికి స్పందించిన రాజ్యసభ ఎంపీ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునఃప్రారంభం పై ప్రస్తావిస్తానని భరోసా కల్పించారని తెలిపారు. దీంతో వారు రాజ్యసభ ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో పర్యవేక్షణ లోపం

● బాలిక అదృశ్యం



బాలికల గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్

బోథ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోస్ట్‌మెట్రిక్ గిరిజన బాలికల హాస్టల్ నుంచి బుధవారం డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థి నిఅదృశ్యమైంది. బుధవారం మధ్యాహ్నం సబ్బులు తీసుకువస్తానని బయటకు వెళ్లిన ఆ బాలిక ఎంతకు తిరిగి రాకపోవడంతో బాలిక అదృశ్యం అయిందన్న విషయం గమనించిన అక్కడి సిబ్బంది సంబంధిత హాస్టల్ వార్డెన్‌కు సమాచారం చేరవేశారు దీంతో వార్డెన్ ప్రియా హాస్టల్‌కు చేరుకొని బాలిక అదృశ్యంపై ఆరా తీశారు. హాస్టల్ నుంచి అదృశ్యమైన బాలిక నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమైంది. ఈ విషయాన్ని సంబంధిత పోలీసులు వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. కాగా బాలికల హాస్టల్‌లో సరైన నిఘా లేకపోవడం వల్ల గతంలో సైతం కొంతమంది విద్యార్థులు బయటకు వెళ్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం వెళ్లిన బాలిక పోలీస్ స్టేషన్‌కు ఎందుకు వెళ్లిందనే విషయం అంతు పట్టని ప్రశ్నగా మిగిలిపోయింది. బాలికల గిరిజన హాస్టల్‌లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు హాస్టల్ పై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన వార్డెన్ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. వారానికి రెండు మూడు సార్లు మాత్రమే హాస్టల్‌కు వస్తుందని అది కూడా మధ్యాహ్నం పూట వచ్చి సాయంత్రం వెళ్లిపోతుందని ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనా బాలికల హాస్టల్‌పై నిఘా కొరవడిందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. ఉన్నత చదువుల కోసం ప్రభుత్వ అధికారులను నమ్మి హాస్టళ్లకు పంపిస్తే బాలికలకు సరైన రక్షణ లేకుండా పోతుందని విద్యా ర్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులే హాస్టల్ నుంచి అదృశ్యమవుతుంటే చదువుల మాట దేవుడెరుగు కానీ మా పిల్లలు ఇంటికి తిరిగి వస్తారా లేదా అన్న అనుమానాలను తల్లిదండ్రులు వ్యక్తపరుస్తున్నారు. బుధవారం జరిగిన సంఘటనపైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు విచారణ చేపట్టినట్లయితే హాస్టల్లో జరుగుతున్న తతంగం బయటపడే ఆస్కారం ఉంది.

'పునర్నిర్మాణంతో ఆలయ అభివృద్ధి'



శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చందా(టీ) గ్రామంలోని మహాలక్ష్మీ ఆలయం పునఃనిర్మాణం చేసుకోవడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా, సాంస్కృతిక కేంద్రంగా మారే అవకాశం ఉందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బుధవారం చందా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలో ఎల్లమ్మ కళాకారులచే నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అటర్ల గోవర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్జుని పాఠశాలలో హై టెన్షన్ వాతావరణం



ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయుడు

నార్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని అర్జునీ విద్యార్థులు బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్య గత కొన్ని నెల నుంచి డైట్ బిల్లు విషయం పై హై టెన్షన్ వాతావరణం ఉన్నట్లుగా విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వహించిన ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయునికి రావాల్సిన మెనూ డైట్ బిల్ దాదాపుగా రెండు లక్షలకు పైగా రావాల్సింది ఉంది. సదరు ఉపాధ్యాయుడు ప్రధాన ఉపాధ్యాయుడికి విన్నవించినా సంబంధిత అంశంపై పట్టించుకోవడం లేదు అంటూ ఏకంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి మార్చ్ 15 తేదీకి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేనట్లుగా తెలుస్తోంది. ఇంటికి కెళ్లి అప్పు సప్పు చేసి ఖర్చులు చేసినా తనను చాలా వరకు ఇబ్బంది పెడుతున్నట్లు సదరు ఉపాధ్యాయుల దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా విహార యాత్రకు డిసెంబర్ నెలలో సైతం విద్యార్థులను తీసుకువెళ్లినట్లు సమాచారం. సంబంధిత విషయంపై ఐటీడీఏ డీడీ షోకాజ్ నోటీస్ పంపారు. మెనూ సైతం విద్యార్థులకు సరిగా అందటం లేదు పలువురు విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశ్రమం ఎలాంటి విషయాలు జరగిన ఐటీడీఏకి పిర్యాదులు అందిన ఎందుకు ఇక్కడ పై అధికారికి చర్యలు తీసుకోవడం లేదు అంటూ మండలంలో పెద్ద ఎత్తున్న చర్చలు నడుస్తున్నాయి.

24 మంది విద్యార్థులు గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 10,050 మంది విద్యార్థులకు గాను 10,026 మంది విద్యార్థులు హాజరు కాగా 24 మంది గైర్హజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలకు గాను 28 పరీక్ష కేంద్రాలను అధికారులు సందర్శించారని పేర్కొన్నారు.



ఉట్నూర్‌లో మామిడి తోటల వేలం నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో



ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో పుచ్చకాయల సాగు పరిశీలిస్తూ..

రికార్డు ధర పలికిన.. ఐటీడీఏ మామిడి తోట వేలం

ఉట్నూర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉట్నూర్ మండల కేంద్రంలోని ఉద్యాన నర్సరీలో బుధవారం నిర్వహించిన మామిడి తోటల బహిరంగ వేలంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధర దక్కింది. ఉద్యాన నర్సరీలో ఉన్న 350 మామిడి చెట్లకు బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధ్యక్షతన జరిగిన వేలం పాటలో రూ.10,05,000 ధర పలికింది. ఇందులో ఉట్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, జైనూరు ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి 17 మంది వ్యాపారస్థులు పాల్గొన్న ఈ వేలం పాటలో న్యాను అనే వ్యక్తి మామిడి తోటను దక్కించుకున్నారు. గతంలో 2021లో అత్యధికంగా రూ.4,66,000 వచ్చినట్లు పీవో ఖుష్బుగుప్తా తెలిపారు. ఐటీడీఏ చరిత్రలో ఇంత ఆదాయం బహిరంగ వేలంలో మొదటిసారి వచ్చిందన్నారు. ఈ సంవత్సరం మంచి పంట వచ్చిందని, దీని వెనుక రెండు సంవత్సరాలుగా ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌తో పాటు ఉద్యాన విభాగ సిబ్బంది కృషి ఉందన్నారు. సరైన సమయంలో ఎరువులు, నీళ్లు అందించడంతో పాటు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా, తోటను దక్కించుకున్న వ్యక్తికి పీవో శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేలం పాటలో వేలం పాట కమిటీ సభ్యులు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ, ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర్‌స్వామి, ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, ఉద్యాన విభాగ సిబ్బంది జయరాజు, అర్షిత, సాయిరాజ్, పూజ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● పుచ్చకాయల తోట పరిశీలన

ఉట్నూర్ ఉద్యానవన కేంద్రంలో మొదటిసారిగా పుచ్చకాయల సాగును చేస్తుండడంతో బహిరంగ వేలం పాట ముగిసిన అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఉద్యాన నర్సరీలో సాగు చేస్తున్న పుచ్చకాయల సాగుని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్‌ని పుచ్చకాయల సాగు వివరాలు అడిగి తెలుసుకుని మొదటిసారి ఉద్యాన నర్సరీలో పుచ్చకాయ సాగుపై అధ్యయనం చేస్తున్నందుకు అభినందించారు.



భైంసాలో ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆస్తి పన్ను బకాయిలపై.. 90 శాతం వడ్డీ మాఫీ

భైంసా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్ను బకాయిలపై ఉండే వడ్డీ 90 శాతం మాఫీ చేసిందని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం సంబంధిత విషయంలో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిదారులు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల డిమాండ్ రూ.5.19కోట్లు ఉండగా ఇప్పటి వరకు 42 శాతంతో మొత్తం రూ.2.18 కోట్లు వసూలు అయినట్లుగా పేర్కొన్నారు. పట్టణవాసులందరూ తమ తమ పన్నులను సకాలంలో చెల్లించి న భైంసా ప్రగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

● రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు పకడ్బందీ ఏర్పాట్లు

ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద నిర్వహించుకునే ప్రత్యేక ప్రార్థనల కోసం గాను పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లుగా భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ప్రత్యేక ప్రార్థనల కోసం భారీ సంఖ్యలో ముస్లింలు హజరుకానున్న దృష్ట్యా అందుకు అనుగుణమైన రీతిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. ఇప్పటికే ఈద్గా పరిసర ప్రాంతాలన్నింటిలో వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరిచినట్లుగా తెలిపారు. ఎండల తీవ్రత అధికంగానున్న దృష్ట్యా తాగునీటి వ్యవస్థను ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ప్రార్థనల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా.. సమస్యలు తలెత్తకుండా వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

మా గోడు పట్టించుకోండి సారూ..

● పాతికేళ్ల నుంచి చాలీచాలని వేతనంతో నెట్టుకొస్తున్న వైనం ● తమకు పర్మినెంట్ చేయాలని వేడుకోలు ● జిల్లాలో 30 మంది ఎస్ఎంఆర్ గ్రామ పంచాయతీ కార్మికుల ఆవేదన

ముథోల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సుమారు 25 సంవత్సరాల నుంచి నామినల్ మాస్టర్ రూల్ (ఎన్ఎంఆర్) సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నా.. నేటికీ కనీస వేతనాలు కాకుండా చాలీచాలని వేతనాలకు విధులు నిర్వహిస్తున్నామని, తమకు రెగ్యులర్ చేయాలని వారు కోరుతున్నారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, కుభీర్, దిలావర్‌పూర్, నర్సాపూర్, లక్ష్మణచాంద, తదితర గ్రామ పంచాయతీల్లో జిల్లాలో సుమారు 30 మంది కార్మికులు నామినల్ మాస్టర్ రూల్ కింద కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ. 11,460 చెల్లించేవారు. ఇటీవలనే నెలకు రూ. 13,660లు చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు సైతం నెలనెలా సక్రమంగా అందాయని మూడు, నాలుగు నెలలకు ఒకసారి వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 25 ఏళ్లుగా వాన అనక, ఎండ, చలి లెక్కచేయక కష్టపడి పని చేస్తున్న నేటికీ ప్రభుత్వాలు మారినా మా తల రాత మారలేదని వాపోతున్నారు. మాకు వేతనాలు పెంచి, పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్, పీఎఫ్‌తో రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 1996-97 సంవత్సరంలో ఎన్ఎంఆర్ కింద గ్రామ పంచాయతీలో డ్రైవర్‌గా, కార్మికులుగా నియామకం పొంది చాలీచాలని వేతనాలకు పనులు చేస్తూ తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారిన మా సమస్య పట్టించుకున్న నాథుడు లేడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మా గోడు పట్టించుకోవాలని వేడుకుంటున్నారు. ఇదివరకు చాలాసార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లామని నేటి వరకు పరిష్కరించబడలేదని అంటున్నారు. మరొక్కసారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి సమస్యను తీసుకెళ్లి విన్నవిస్తామని వారు పేర్కొంటున్నారు. కాగా, ఈ విషయమై డీపీవో శ్రీనివాస్‌కు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా వివరణ కోరగా.. జిల్లాలో సుమారు 30 మంది వరకు ఎన్ఎంఆర్ కింద గ్రామ పంచాయతీలలో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారని, ఇదివరకు వారు విన్నవించిన విన్నపాలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.



ముథోల్ గ్రామ పంచాయతీ



ముథోల్ ఎన్ఎంఆర్ కార్మికులు

సారూ.. మాకు పర్మినెంట్ చేయండి

: టి.అమృత్, ముథోల్ జీపీ, ఎన్ఎంఆర్ కార్మికుడు



సార్ ముథోల్ గ్రామ పంచాయతీలో ఎన్ఎంఆర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా గత 1997 నుంచి విధులు నిర్వహిస్తున్నాను. చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి మాకు ఆదుకొని పర్మినెంట్ చేయాలని చేతులెత్తి వేడుకుంటున్నాను.

ఉన్నతాధికారులు మమ్మల్ని ఆదుకోవాలి

: కాంతాబాయి, ఎన్ఎంఆర్ వర్కర్, ముథోల్ గ్రామ పంచాయతీ



అయ్యా నేను గత 24 సంవత్సరాల నుంచి ముథోల్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నాను. మాకు సరిపడా వేతనాలు లేవు. ఉద్యోగ భద్రత లేదు. పీఎఫ్ సౌకర్యం లేదు. ప్రస్తుత కాలంలో ఇచ్చే వేతనం సరిపోవడం లేదు. పెద్ద మనసుతోని పెద్దసార్లు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మాకు పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నా.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

: ముజీబ్, ఎన్ఎంఆర్ వర్కర్, గ్రామ పంచాయతీ ముథోల్



నేను ముథోల్ గ్రామ పంచాయతీలో గత 26 ఏళ్ల నుంచి ఎన్ఎంఆర్ కార్మికుడిగా పని చేస్తున్నాను. నాకు రిటైర్మెంట్‌కు నాలుగైదు సంవత్సరాల సమయం ఉంది. ఇప్పటి వరకు చాలీచాలని, సయానికి రాని వేతనాలకు పని చేశాను. మాకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం లేదు. ఉద్యోగ భద్రత లేదు. పీఎఫ్ సౌకర్యం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో మా సేవలను గుర్తించి పర్మినెంట్ చేయాలని కోరుతున్నాం.

ఆంధ్రజ్యోతి పరిశీలన



భైంసా మండలం వానల్‌పాడ్‌లో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

చెట్ల నీడలే శరణ్యం!

● భైంసా డివిజన్ పరిధిలో పలుచోట్ల బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల బాధలెన్నో.. ● ఉన్న చోట వృధా.. లేని చోట వ్యథ

భైంసా, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భైంసా డివిజన్ పరిధిలోని ప్రయాణికులు బస్ షెల్టర్లు లేక పాట్లు పడుతున్నారు. అధికార యంత్రాంగం అవలంబిస్తున్న అలసత్వ విధానాలకు పాలకుల బాధ్యతారాహిత్య చర్యలు తోడవ్వడం మూలంగా బస్‌షెల్టర్లు ఉన్న చోట వృధా అవుతుండగా లేనిచోట వ్యధలపాలవుతున్నారు. ఈ క్రమంలో ప్రయాణీకులు వర్షాకాలంలో వర్షాలకు తడుస్తూ, శీతాకాలంలో చలికి విలవిలలాడుతూ,వేసవిలో ఎండల బారిన పడుతూ బస్సుల కోసం నిరిక్షించాల్సి వస్తోంది.

సరైన రీతిలో లేని బస్ షెల్టర్లు

భైంసా డివిజన్ పరిధిలోని కుంటాల, లోకేశ్వరం, ముథోల్ ,భైంసా కేంద్రాలు మినహా ఎక్కడా కూడా సరియైన రీతిలో బస్ షెల్టర్లు లేవు. మిగతా ప్రాంతాల్లో పరిశీలిస్తే కుంటాల మండలంలోని తురాటి, ఓలా, అంభకంటి, అందకూర్, భైంసా మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, మాటేగాం, మహాగాం, కోతల్‌గాం, వాలేగాం, ముథోల్ మండలంలోని సరస్వతీ నగర్, తదితర ప్రాంతాల్లో బస్ షెల్టర్లున్నప్పటికి అవి నిరూపయోగంగానే ఉన్నాయి. వీటి వద్ద బస్సులు ఆపకపోవడంతో పాటు ప్రయాణీకులకు అనువుగా లేకపోవడం మూలంగా అలంకారప్రాయంగా మారిపోయాయి. ఇందులో కొన్ని బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకోగా.. మరికొన్ని ఆయా గ్రామస్థులు తమ తమ ధాన్యాలను, వ్యవసాయ పరికరాలను నిల్వగా ఉంచుకోవడానికి వినియోగించడం గమనార్హం.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

ఇక ప్రధాన ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ప్రయాణీకులు పడుతున్న పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయి. ముథోల్ నియోజక వర్గ పరిధిలోని అర్లి క్రాస్ రోడ్డు వద్ద నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహిస్తుంటారు. లోకేశ్వరం మండలంలోని అధిక గ్రామాలవాసులు ఈ క్రాస్ రోడ్డు వద్ద నుంచి ప్రయాణం చేస్తారు.ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడం మూలంగా ప్రయాణీకులు సమీపంలో గల చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరిక్షించాల్సిన దుస్థితి నెలకొని ఉంది. కల్లూర్‌లో గల సాయిబాబా మందిరానికి ప్రతినిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. అంతేకాకుండా కుంటాల మండల కేంద్రంతో పాటు 12 గ్రామాల వాసులు కల్లూర్ మీదుగా రాకపోకలు నిర్వహిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ గ్రామంలో కూడ బస్ షెల్టర్ లేదు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన ముథోల్ మండలంలోని బ్రిదెల్లి, తానూర్ మండలంలోని బెల్ తరోడా, కుభీర్ మండలంలోని నిగ్వా, సిర్పెల్లి గ్రామాల్లో సైతం బస్ షెల్టర్లు లేకపోవడం మూలంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. తానూర్ మండల కేంద్రంలో సైతం బస్ షెల్టర్ లేదు. ఈ క్రమంలో ఈ కేంద్రాల నుంచి రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు అక్కడి ప్రాంతంలో గల చెట్ల నీడలే శరణ్యమవుతున్నాయి. మరి కొంత మంది ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో సమీపంలో గల హోటళ్లలో యాజమానుల ఈసడింపులు, చీదరింపులు భరిస్తూ వాటి ముందు నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం మండే ఎండల దాటికి ప్రయాణికులు బస్ షెల్టర్లు లేక విలవిలలాడిపోతున్నారు. అధికార యంత్రాంగం ఇకనైనా నిరూపయోగంగా మారిన బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకవచ్చి ప్రాధాన్యతననుసరించి బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎండలో చెట్టు నీడ కింద నిలబడి బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఫొటో న్యూస్





గిరిజన గ్రామాలకు వెలుగులు

ఆదివాసీల జిల్లాగా పిలువబడే ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ దీపాలకు నోచుకోని గిరిజన గ్రామాలు ఎట్టకేలకు సోలార్ వెలుగులకు నోచుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం (ఆదిలాబాద్ మండలం పోతగూడ-3 కోలాం గిరిజనుల)నుంచి వేరుపడిన కొంత మంది గిరిజనులు నిషాన్‌ఘాట్‌లో నివసిస్తున్నారు. అయితే విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.68 లక్షలు వెచ్చించి ఇంటింటిపై సౌర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సోలార్ వెలుగుల్లో ఆదివాసీలు మురిసి పోతున్నారు.

(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

అడుగంటిన జలాలు.. అల్లాడుతున్న మూగజీవాలు!



● బోథ్‌లో ఉన్న వాగు వద్దకు నీరు తాగేందుకు వచ్చిన ఆవులు

బోథ్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మండలంలోని ఆయా గ్రామాల సమీపంలో గల వాగులు ఎండిపోయాయి. దీంతో మూగజీవాలకు తాగు నీటి ఎద్దడి నెలకొంది. ఫలితంగా వాటి కాపరులు మూగజీవాలకు నీరు పెట్టించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు పశుగ్రాసం సహితం లేకుండా పోయింది. దేవుడు కరుణించి వర్షాలు పడితే తప్ప మూగజీవాల ఆకలి, దప్పిక తీర్చడం ఇబ్బందిగా మారే ఆస్కారం ఉందని పలువురు రైతులు అంటున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జాబడే రీతిక ఎంపిక

● రాష్ట్ర బాలికల జట్టులో చోటు



ఆదిలాబాద్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బీహార్ రాష్ట్రంలోని గాయ జిల్లాలో ఈనెల 27 నుంచి 30 తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయిలో సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిని జాబడే రీతిక ఎంపికయ్యారు. జాతీయస్థాయి టోర్నీకు జిల్లా క్రీడాకారిని ఎంపిక కావడంతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ పాటర్న్ గోడం నగేష్, చైర్మన్ పాయల శంకర్, అధ్యక్షుడు ఉష్కం రఘుపతి , ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ జబడే, కబడ్డీ అసోసియేషన్ సంఘ బాధ్యులు సీనియర్ క్రీడాకారులు అభినందించారు. జాతీయ స్థాయిలో క్రీడా పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు





సీతారాముల కళ్యాణం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

ఖానాపూర్‌లో శ్రీరామనవమి వేడుకలకు ముహూర్తం ఖరారు

- ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఉత్సవాలు
- వివరాలు వెల్లడించిన ఆలయ కమిటీ

ఖానాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల అతి పురాతనమైన సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతీ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీరామ నవమి ఉత్సవాలకు ఈ ఏడాది ముహూర్తం ఖరారు చేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ బృందం వివరాలు వెల్లడించింది. ఈ సందర్భంగా ఈ నెల 30వ తేదీ నుండి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది. ఈ నెల 30వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభం కానున్న శ్రీరామనవమి వేడుకల్లో తొలి రోజు శ్రీరామ నవరాత్రి దీక్ష కంకణధారణ, ఉగాది పచ్చడి మహా తీర్థప్రసాద వితరణ, తొలి రోజు నుంచి ఉత్సవాలు ముగిసే వరకు రోజు సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4వ తేదీన శాంతి పఠనము, ఆలయ యాగశాల ప్రదక్షిణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, ఏప్రిల్ 5వ తేదీన గణపతి పూజ కర్మణ పుణ్యాహవచనం, సుదర్శన నరసింహహోమము, సీతారామచంద్రస్వామి మూలమంత్ర హోమాలు, ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు సీతారామచంద్రస్వామి సుప్రభాత సేవ, అభిషేకము, సీతారాముల కళ్యాణ మహోత్సవం, అన్నదానం, ఏప్రిల్ 7వ తేదీన ఉత్తరవాహిని గోదావరి నదిలో సీతారాముల తెప్పోత్సవం కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరై సీతారాముల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. సీతారాముల కల్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సవ కమిటీ అధ్యక్షులు గొండాల డబ్బ శ్రీనివాస్, పాలెపు సుదర్శన్, సతీష్‌రావు దేశ్‌పాండే, ఎలిశెట్టి లింగేశ్వర్, మాలెపు రాజశేఖర్, గడదాసు రవిచరణ్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, డాక్టర్ రాము, పంబాల భీమన్న, సల్ల చంద్రహాస్, సల్ల వంశీ, గాడ్పు చందు, చిలుకూరి ఇస్తారి, తదితరులున్నారు.


లంగ్డాపూర్‌లో షూటింగ్ ప్రారంభం



చిన్న సినిమాను ప్రారంభిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంగ్డాపూర్‌లో తెలంగాణ పల్లె సినిమాలు బ్యానర్‌పై నా పెళ్ళాం సర్పంచ్ అయితే అనే చిన్న సినిమాకు బుధవారం క్లాప్స్ కొట్టి ప్రారంభించినట్లు నిర్మాత రామ్ రమేష్ తెలిపారు. సినిమాలో హైదరాబాద్‌లోకు చెందిన లౌక్య హీరోయిన్‌గా, చుంచు రవి హీరోగా నటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుమతి, హరికృష్ణ, నరేందర్, రవి, ఆటో సాయి, చించోలి రాజ్, శ్రీను, సాగర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అవే సమస్యలు అదే నిర్లక్ష్యం



సివిల్ దుస్తుల్లో విద్యార్థులు (ఫైల్)

- బాసర ట్రిపుల్ ఐటీలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- పరీక్షలొచ్చినా... విద్యార్థులకు ఇంకా పరేషానే..
- కనీసం విద్యార్థులకు అందని యూనిఫామ్స్
- హాస్టళ్లలో పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోని మౌలిక వసతులు
- నిధుల కొరతే ప్రధాన సమస్య

బాసర, మార్చి, 26 : (ఆంధ్రజ్యోతి) : బాసరలోని ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ సమస్యలకు కేరాఫ్‌గా మారిపోయింది. చిన్నచిన్న మౌలిక వసతి సౌకర్యాలు సైతం దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి. గ్రామీణ విద్యార్థుల కోసం ఉన్నతమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ విద్యా సంస్థలో ఉద్దేశ్యం గొప్పగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్ర విద్యార్థులకున్న ఏకైక ఈ యూనివర్సిటీ విద్యార్థులు అసౌకర్యాలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. యూనివర్సిటీ ఏర్పడి 15 సంవత్సరాలు కావస్తుండడంతో భవనాలన్నీ మరమ్మతుల స్థాయికి చేరుకున్నాయి. మరోపక్క విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సినవి సకాలంలో అందడం లేదు. ఆలస్యంగానైనా లభించడం లేదు. వీటికి తోడు అధ్యాపకుల కొరత, నాణ్యమైన విద్యాబోధనలో ఇంకా సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇటు మౌలిక వసతులు, మరోపక్క అకాడమిక్ పరంగా అసౌకర్యాల మధ్యనే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. గత కొన్నేళ్ల నుండి విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం అనేకమార్లు ఆందోళనలు నిరసనలు చేపట్టారు. హామీలివ్వడం, ఆ తర్వాత విద్యార్థులు ఆందోళనలు విరమించడం, అనంతరం సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం ఇక్క పరిపాటిగా మారింది.

ఇంకా అందని యూనిఫామ్స్

కొత్తగా చేరిన విద్యార్థులకు యూనివర్సిటీలో చేరగానే యూనిఫామ్స్, స్పోర్ట్స్ యూనిఫామ్స్ రెండు జతల షూలు, బెడ్‌షీట్‌లు వంటి హాస్టల్ సామాగ్రి అందివ్వాలి. ప్రవేశం పొందిన విద్యార్థికి యూనివర్సిటీలో చదువు పూర్తయ్యే సరికి ఇలా రెండు సార్లు వీటన్నింటిని యూనివర్సిటీయే ఉచితంగా అందిస్తుంది. కాని గత రెండేళ్ల నుంచి ఇది కొనసాగడం లేదు. విద్యార్థులు సివిల్ డ్రెస్సుల్లోనే తరగతులకు హాజరవుతున్నారు. అనేక సార్లు విద్యార్థులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు.

లాప్‌టాప్‌ల ఊసే లేదు

పదో తరగతి తర్వాత ఇక్కడ చేరిన విద్యార్థులకు యూనిఫామ్స్, హాస్టల్ సామాగ్రితో పాటు ప్రతి ఒక్క విద్యార్థికి ఒక్కో లాప్‌టాప్‌ను ప్రభుత్వమే అందించేది. ఆరు సంవత్సరాల ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యే వరకు లాప్‌టాప్‌ను వినియోగించుకునేవారు. మొదటి నుంచి కంప్యూటర్‌కు సంబంధించిన కోర్సులు, పరీక్షలు ఉంటాయి. గత రెండు, మూడేళ్ల నుంచి కొత్తగా చేరిన విద్యార్థులకు లాప్‌టాప్‌లు ఇవ్వడం లేదు. ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా సకాలంలో అందించకపోవడంతో చదువు పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ ఇచ్చినా సీనియర్‌లు ఆరు సంవత్సరాల పాటు వినియోగించుకున్న లాప్‌టాప్‌లు అందిస్తుండడంతో అవి పనిచేయక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక పీయూసీ-1, పీయూసీ -2 చదివే 3 వేల మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందించే పరిస్థితిలో యూనివర్సిటీ లేదు. 200- 300 ల కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

హాస్టల్‌లో అన్ని సమస్యలే

హాస్టల్ భవనాలు నిర్మించి 15 సంవత్సరాలు గడుస్తుంది. తలుపులు, కిటికీలు ఊడిపోయి పారిశుధ్యం, నీటి సరఫరా వ్యవస్థలన్నీ మరమ్మతుల స్థాయికి చేరుకున్నాయి. మంచాలు, పరుపులు లేక విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. ట్యూబ్ లైట్లు ఫ్యాన్‌లు పాడైపోతే సకాలంలో కొత్తవి ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. పాడైపోయిన ట్యూబ్‌లైట్ల స్థానాల్లో కొత్తవి అమర్చే ప్రక్రియ చేపడితే 2 వేల ట్యూబ్‌లైట్లు ఒకేసారి అవసరం ఏర్పడింది. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ట్రిపుల్ ఐటీలో మౌలిక వసతులు ఏ స్థాయికి చేరాయో విద్యార్థులు ఏ స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అర్థమవుతుంది.

నిధుల కొరతే ప్రధాన సమస్య

పేదలకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ట్రిపుల్ ఐటీ నిధులు లేక కొట్టుమిట్టాడుతుంది. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. కార్పొరేట్ స్థాయిలో విద్య అందించడం ఏమో గాని ప్రతిభావంతులైన విద్యార్థులకు నష్టం కలిగించకుంటే చాలు అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ప్రభుత్వం నుంచి అవసరం మేరకు యూనివర్సిటీకి నిధులు అందడం లేదు 9 వేల మంది విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలతో యూనివర్సిటీని నడపడం సాధారణ విషయం కాదు. రూ.కోట్ల నిధులు అవసరం ఉంటుంది. ఈ సారి రాష్ట్రబడ్జెట్‌లో ఆర్జీయూకేటీకి 150 కోట్లు అడిగితే రూ.39 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు యూనివర్సిటీలో ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతాయి. ఇక విద్యార్థుల వసతి సౌకర్యాల ఏర్పాటు ఎక్కడి నుంచి జరుగుతుంది. పై నుంచి నిధులు రాకపోవడంతో కింది స్థాయి అధికారులు ఏం చేయలేకపోతున్నారు. యూనివర్సిటీపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఉన్న యూనివర్సిటీకే నిధులు కేటాయించని ప్రభుత్వం రాష్ట్రంలో మరో రెండు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల ఏర్పాటు కోసం సన్నాహాలు చేస్తుంది. ఒక్కో క్యాంపస్‌కు రూ. 500ల కోట్ల అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉన్న యూనివర్సిటీని పట్టించుకోని ప్రభుత్వం కొత్త క్యాంపస్‌ల ఏర్పాటు పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే పోరు

ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అసెంబ్లీ వేదికగా ట్రిపుల్ ఐటీ సమస్యలపై పోరు కొనసాగిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ప్రతి అసెంబ్లీ సెషన్‌లో ట్రిపుల్ ఐటీ సమస్యలను ప్రస్తావించారు. ఇక్కడి పరిస్థితిని అసెంబ్లీ ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నారు. మంత్రులను, రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవిస్తున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం బాసర ట్రిపుల్ ఐటీని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నాం

యూనివర్సిటీలో చాలా సమస్యలు పేరుకపోయాయి. ఒక్కొక్కటి క్లియర్ చేస్తున్నాం. యూనిఫామ్స్ కోసం ప్రభుత్వం చేనేత సంస్థల నుండి తీసుకోవాలని సూచించింది. అందుకే జాప్యం జరుగుతుంది. వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థులకు అందిస్తాం. హాస్టళ్లలో వసతులను మెరుగుపరిచేందుకు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నాం. ఏది చేయాలన్న ఫండ్స్ అవసరముంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకెళుతున్నాం. ఒకటి పరిష్కరించామంటే మరొక సమస్య ఉత్పన్నమవుతుంది.

(ప్రొఫెసర్ గోవర్ధన్, వైస్ చాన్సలర్)

ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులపై 90 శాతం రాయితీ

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను పాత బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ చేసిందని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 శాతం వడ్డీతో చెల్లించేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గడువులోగా పన్ను చెల్లించాలని ప్రజలను కోరారు. లేనట్టయితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడ్డ లారీని పరిశీలిస్తున్న దృశ్యం

సోన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం ఉదయం వేకువ జామున లారీ బోల్తా పడినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికిచెందిన డ్రైవర్ దుర్గేష్ కుమార్ నాగపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ (ఆర్‌జే 11 జీసీ 7473) అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల బోల్తా పడిందని, ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న పీడీపీఎస్ బియ్యం బస్తాలు పట్టుకున్న పోలీసులు

ఖానాపూర్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి) : కడెం నుండి నిర్మల్ వైపు ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం మధ్యాహ్నం తర్లపాడ్ వద్ద ఖానాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామానికి చెందిన రహెమత్ అనే వ్యక్తి కడెం ప్రాంతంలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో నిర్మల్ వైపు తరలిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా తర్లపాడ్ వద్ద సదరు ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఆటోలో నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు పీడీఎస్ బియ్యం, తూకం యంత్రం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సదరు బియ్యంతో సహా ఆటోను సైతం సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.



అక్రమంగా బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించిన ఆటో ఇదే

నిరుపేదలే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ఖానాపూర్‌లో నిర్మాణంలో ఉన్న నమూనా ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన
- ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష
- ఎల్ఆర్ఎస్ పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆదేశం
- ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడి



నిర్మాణంలో ఉన్న నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖానాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు అందిండచమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఖానాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను, ఇంటి డిజైన్ తదితర అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. నిర్మాణ నాణ్యతను మరింత మెరుగుపరచాలని పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కచ్చితంగా అందుతాయని, దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 31వ తేదీతో ఎల్ఆర్ఎస్‌కు ఇచ్చిన గడువు పూర్తవుతోందని ఆలోపు ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం లబ్ధి కలుగుతుందని కలెక్టర్ సూచించారు. ఈ విషయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఆస్తి పన్ను వసూళ్లను 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఖానాపూర్ ప్రాంతం నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, స్థానిక మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు, తదితరులున్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందు

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

- ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్



సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, హెచ్‌వోడీలు

బాసర, మార్చి, 26 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని బాసర ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ సూచించారు. బుధవారం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఓఎస్డీ మురళిదర్శన్, ఏవో రణధీర్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉన్నత విద్యాశాఖ సూచనలను సమావేశంలో వీసీ అధ్యాపకులకు అందించారు. న్యాక్ అక్రిడిటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇన్‌స్టిట్యూషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ పై దృష్టి సారించాలని చెప్పారు. వర్క్‌షాపులు, సెమినార్‌లు, సమావేశాలు, అధ్యాపక విజయాలు, ఔట్రీచ్, ప్రాజెక్టు వర్క్‌లను సమన్వయం చేసి అక్రిడిటేషన్ ప్రక్రియకు సిద్ధం చేయాలని చెప్పారు. విద్యార్థి, అధ్యాపక మార్గదర్శక కార్యక్రమాలను హైలైట్ చేసి వార్షిక నివేదికను తయారు చేయాలని సూచించారు. గత ఐదు సంవత్సరాల రికార్డును నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని నిర్ధారించడానికి విద్యుత్, నీరు, వైద్య సౌకర్యాల వంటి ముఖ్యమైన సేవలను అందించడం ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల నిర్వహించిన టెక్ ఫెస్ట్, స్పోర్ట్స్ డే, సాంస్కృతిక కార్యక్రమాలపై అధ్యాపకులను, కన్వీనర్‌లను ప్రశంసించారు. ఈ సమావేశంలో అసోసియేట్ డీన్‌లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా చెక్కు అందజేత

ముథోల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మసీదు నిర్వాహకులకు లక్ష రూపాయల చెక్కును ఆర్ఐలు నారాయణపటేల్, సరస్వతీలు అందజేశారు. ప్రతి సంవత్సరం రంజాన్ పవిత్రమాసం పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి రంజాన్ ఇఫ్తార్‌కు ఈ చెక్కును అందజేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అందులో భాగంగానే ఈ చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎజాజ్ ఖాన్, అజారుద్దీన్, ఇమామ్ ఖలీముద్దీన్, అఫ్రోజ్ ఖాన్, తదితరులు ఉన్నారు.

ఆర్డీవో, కమిషనర్‌ను కలిసిన డీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ నూతన డీఎం కే.పండరి బుధవారం ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారికి మొక్కను అందజేశారు. సహా మేనేజర్ రాజశేఖర్, వి.రమణ, తదితరులున్నారు.

మాజీ మంత్రి పరామర్శ

నిర్మల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాందేడపు చిన్నును బుధవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల చిన్ను సోదరుడు కిషన్ అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇంద్రకరణ్‌రెడ్డి బుధవార్‌పేట్‌లోని నివాసంలో చిన్నును కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, మనోధైర్యం కల్పించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

పరీక్ష సెంటర్‌ను పరిశీలించిన డీఈవో

ముథోల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం జిల్లా విద్యాధికారి రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకటి, రెండు రూమ్‌లలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన బెంచీలు చిన్నవిగా ఉన్నాయని వాటిని మార్చి వేరే బెంచీలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈయన వెంట జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ లింబాద్రి, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి)లో రైస్‌మిల్ సీజ్



రైస్ మిల్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంత ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ను అధికారులను బుధవారం సీజ్ చేశారు. ఫుడ్ కార్పొరేషన్ అధికారి రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం... 3191 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు తెలపాలని గతంలో నోటీసు పంపించినా స్పందించకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు వెల్లడించారు. నిర్వాహకులు లేకపోవడంతో తాళాలు పగలగొట్టి రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీఎస్ రమాదేవి తెలిపారు. ఆమెతో పాటు ఎమ్మార్వో శ్రీనివాస్, గిర్దావర్ నవజ్యోతి, ఏఎస్సై శంకర్, తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్(జి), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తురాటి గ్రామానికి చెందిన బి. లక్ష్మీ నిర్మల్ నుండి బస్సులో తురాటి గ్రామానికి వచ్చి బస్సు దిగి రోడ్డు దాటే క్రమంలో కల్లూర్ నుండి కుస్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం లక్ష్మీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.